# "వెల అమూల్యం"

తాకెళ్ళ శివప్రసాద్

వెంకటరత్నం గారింట్లో కూడా ఇరవైయ్ తారీఖునే పెళ్ళిట. వెళ్ళకతప్పదు. ఈ పెళ్ళిళ్ళ సీజన్‌లో వచ్చే చిక్కేయిది.

ఒకేముహూర్తానికి నాలుగైదు పెళ్ళిళ్ళుంటాయి.

మొన్న అదివారం మధ్యాహ్నం మా ఆవిడ తర పున బంధువులొకరు వాళ్ళమ్మాయి పెళ్ళికి పిలవడాన్కి వచ్చారు. యింటి పనుల్లో సహాయంగా వుంటుందని మా ఆవిడని రెండు రోజుల ముందుగానే రమ్మన్నారు. అదే రోజు మా యింటాయన తన కొడుకు పెళ్ళని ఆహ్వానించారు. మా కొలీగ్ పెళ్ళి కూడా, ఈ రెండు పెళ్ళిళ్ళు జరిగే రోజునే, ఇరవైయ్ తారీఖునే–!

ఈ హడావిడిలో హడావిడిగా ఈ రోజు ఆఫీసు కొచ్చిన వెంటనే తెలిసిన విషయ మేమిటంటే–

వెంకటరత్నం గారింట్లో కూడా ఇరవైయ్ తారీఖునేపెళ్ళి. అయన మా సెక్షన్ ఆఫీసర్–!

ప్రపంచంలో ఏళ్ళ తరబడిగా సుస్థిరంగా సాగి పోతున్న 'వ్యాపార సంబంధాల్లో' ఆఫీసరూ – గుమాస్తా సంబంధ మొకటి. ఆఫీసర్ ప్రాపకం కోసం గుమాస్తా తహతహలాడడం సహజం. అందులోనూ ముఖ్యంగా వెంకటరత్నం గారి లాంటి 'పలుకుబడి' (కేవలం మా డిపార్ట్ మెంట్ లోనే కాదు. ఇతర డిపార్ట్ మెంటుల్లో కూడా ఆయనకి పేరుంది. ఓ మంత్రిగారి కాయన దూరపు బంధువు కూడా) వున్న వ్యక్తుల కరుణా కటాక్ష వీక్షణాల కై నిరీక్షించడం మరీ సహజం.

కనుక ఏ పెళ్ళికి వెళ్ళినా, వెళ్ళక పోయిన వెంకటరత్నం గారింట్లోని పెళ్ళికి తప్పక వెళ్ళాలని నిర్ణయించు కొన్నాను శుభలేఖ అందుకున్న వెంటనే–

శుభలేఖ కూడా 'మొదటి తరగతి బ్రాండ్'ని ప్రతిబింబిస్తోంది. చాలా క్లాస్‌గా, ఇంగ్లీషులో, గోల్డెన్ లెటర్స్‌లో వుంది.

మధ్యాహ్నం క్యాంటీన్ నుండి వస్తుంటే, మా సెక్షన్ ప్యూన్ రంగయ్య ఎదురుబడ్డాడు. ఈ మధ్య లీవ్ తీసుకున్నాడు. నన్ను చూసి, నమస్కరించి– చేతిసంచీలోంచి ఓ శుభలేఖ తీసి నా చేతికిచ్చి–

"తమరు తప్ప కుండా రావాలి సార్ పెళ్ళికి...." అన్నాడు.

యధాలాపంగా శుభలేఖ చదివాను. ఆశ్చర్యం., ఆర్థికంగా హెచ్చు తగ్గుల మాట అటుంచితే, ముహూర్తాల విషయంలో 'భేదం' లేదని పించింది. రంగయ్య యింట్లో పెళ్ళి కూడా ఇరవైయ్ తారీఖే!

రంగయ్య పదేపదే రమ్మనమని చెప్పి, వెళ్ళిపోయాడు. వెంకటరత్నం గారి శుభ లేఖ అందుకున్నప్పుడు 'వెళ్ళాలని' ఎంత తొందరగా నిర్ణయం తీసుకున్నానో, అంత కంటే తక్కువ సమయంలో నే రంగయ్య యింట్లో పెళ్ళికి వెళ్ళే ప్రసక్తే లేదను కున్నాను.

డ్రాయర్ సొరుగులో రంగయ్య యిచ్చిన శుభలేఖ పడేస్తూ, మరో సారి వెంకటరత్నం గారి 'శుభలేఖ' కళ్ళారా చూసుకున్నాను–

ఆ క్షణమే నాకో విషయం స్పష్టంగా అర్థమయ్యింది–

సమాజంలో థర్డ్ క్లాస్ మనిషికి 'ఫస్ట్ క్లాస్' మనిషికి తేడా 'శుభలేఖ' తో నే చెప్ప వచ్చుని.

* * * * *

మా ఆవిడ బంధువులు కోరినట్టుగా వాళ్ళింటికి దాన్ని రెండు రోజుల ముందుగానే పంపి, వీలైతే నేనూ పెళ్ళికి వస్తానని చెప్పాను.

ఇరవైయ్ తారీఖు తెల్లవారు ఝామునే మా యింటి వాళ్ళబ్బాయి పెళ్ళి. మూడు గంటలకే లేచి, తెమిలి, నాలుగు అక్షింతలు వేసి, మా కొలీగ్ మ్యారేజ్ జరుగుతున్న చోటుకెళ్ళి, అటెండెన్స్ వేయించుకొని, వెంకటరత్నం గారింటికి బయలు దేరే సరికి పదకొండు గంటలయ్యింది.

నిజం చెప్పొద్దు, మొదట్నుంచి నాకు వెంకటరత్నం గారింట్లో జరిగే పెళ్ళి మీదే ధ్యాసంతా వుంది. ఏదో ఫార్మల్‌గా 'అటెండ్' అవ్వాలి కనుక వెళ్ళాను రెండు పెళ్ళిళ్ళకి–

అసలే మరో రెండు నెలలలో ప్రమోషన్ లిస్ట్ రాబోతోంది. సర్వీసులో రిమార్కు లేకుండా, ప్రమోషన్ లిస్ట్‌లో చోటు చేసుకోవాలంటే వెంకటరత్నం గారి లాంటి వారిని ఆశ్రయించక తప్పదు.

నేను వెళ్ళే సరికి వాతావరణం హడావిడిగా వుంది. మా ఆఫీసు వాళ్ళెవరైనా కన్పిస్తారేమో నని చూశాను. ఎవరు వచ్చినట్టు లేదు.

అంతా కొత్తగా వుండడం చేత అయోమయంగా అటూ ఇటూ తిరిగాను.

మొదటి తరగతి జీవితానికి సంబంధించిన పెళ్ళి వల్ల అంతా ఖరీదుగా వుంది.

ఆడవాళ్ళు రంగురంగుల చీరల్లో, మెడలకి కిలోల కొలది బంగారు నగలు 'వేలాడ' దీసుకొని, అపర అప్సరసల్లా మేకప్‌లు 'కొట్టుకొని', దట్టంగా రాసుకున్న లిప్‌స్టిక్ పెదాలని విచిత్ర విన్యాసాలకి గురి చేస్తూ, బిగ్గరగా నవ్వుతూ, అరుస్తూ, నవ నాగరీక మణుల మనిపించు కుంటున్నారు–

ఇక మొగాళ్ళ వైపుకి వొస్తే–

నాలుగైదు గుంపులుగా చీలి–

రకరకాల విషయాలు చర్చించుకుంటున్నారు.

అందరూ ఆంధ్ర దేశపు రాజధానిలో జీవితాలు వెలగబెడుతున్నా, 'ఆంధ్ర మాతలకే జన్మించినా, పోత పాల ప్రభావం వల్ల కాబోలు, ఆంగ్లేయుల్లా 'తెలుగు మాట్లాడ్డానికి సిగ్గుపడుతూ–

ఇంగ్లీషులో హాలీవుడ్ తారల తొడల గురించి రంజుగా, హిందీలో ముచ్చటగా మూడోసారి మొగుడ్ని మార్చి... 'హ్యాట్రిక్' చేసిన హీరోయిన్ గురించి చర్చించుకుంటున్నారు.

నేను టైం చూశాను.

పదకొండున్నర.

యింకా కళ్యాణ మండపం దగ్గరికి బ్రహ్మణుడు వచ్చిన ఛాయలు లేవు. బ్యాండ్ మేళం వాళ్ళు ఏదో హిందీ చిత్రంలో బూతు పాటని ఘోరంగా మ్రోగిస్తున్నారు.

"ఏవండీ.... ముహూర్తం పదిన్నరకే కదా...." అని ప్రశ్నించాను.

అతను నా కేసి విసుగ్గా చూసి, నన్ను అమాయకుడిలా జమకట్టి – అనవసరపు నవ్వొకటి వెకిలిగా నవ్వి–

"మీకు తెలీదా?... ముహూర్తం మారింది..... ఒకటిన్నరకి ముహూర్తం...." అని నా కేసి చిత్రంగా చూసి, వేగంగా, హాలీవుడ్ తారల తొడల గుంపువైపు సాగిపోయాడు.

నాకు వుసూరు మన్పించింది. ఇంకా దాదాపు రెండు గంటల కాలం గడపాలి.

... కాలం భారంగా గడిచింది. తెల్లవారు ఝామునే మాయింటాయన కొడుకు పెళ్ళి వల్ల రాత్రి సరిగ్గా నిద్ర పోలేదు. ఎప్పుడు తెల్లారుతుందా అని ఎదురు చూడడంలో మహా అయితే ఓగంట పడుకొని వుంటాను. కళ్ళు మంటలు. తల బరువు. వచ్చి గంటయినా వెంకటరత్నం గారు కన్పించలేదు.

... కల్యాణ మండపం దగ్గర ఏదో అలికిడి విన్పించి ఉలిక్కి పడ్డాను. నాకే తెలీకుండా కునుకు పట్టేసింది.

దగ్గర్లోనే వున్న కొళాయి దగ్గరకెళ్ళి మొహం కడుక్కొని, తెలుసున్న మొహం ఏదైనా కన్పిస్తుందేమోనని వెతికాను. చాలా మంది జనం వచ్చారు. వీధిలోకి వెళ్ళి చూస్తే – వీధంతా కార్లమయం. పది నిముషాలు అటూ ఇటూ తిరిగి, ఎవరూ కనిపించక, అక్కడే వున్న కుర్చీలో కూలబడ్డాను.


మంత్రాలు విన్పిస్తున్నాయి.

ప్రొద్దుటి నుండి కడుపులో 'ఫుడ్' సరిగ్గా పడక, ఆత్మారాముడు ఆకలని గోలచేయడం

ప్రారంభించాడు.

సాధారణంగా ఏ పెళ్ళికి వెళ్ళినా, మనిషిని చూసినా వెంటనే కాఫీ, టిఫిన్ యిస్తారు. ఈ పెళ్ళిలో అలాంటి వేమీ లేనట్టున్నాయి.

నీరసంగా వున్న నాకు వెంకటరత్నం గారిని చూసేసరికి కొండంత శక్తి కలిగింది. ఆయన దూరం నుండే పలకరింపుగా చేయి వూపారు.



ఆ 'చేయి' ఎంతమందిని వుద్దేశించి వూపారో నాకు తెలీదు కానీ, 'అందులో' నా క్కూడా భాగముందని సంతోష పడ్డాను. సుము హూర్తమయ్యింది.

'చదివింపుల' సమయం. చాలా మంది పెద్ద పెద్ద ప్యాకెట్లతో బహుమతు లిస్తున్నారు. నేను బొత్తిగా పాతిక రూపాయలంటే బాగోదని అర్ధనూట పదహార్లు చదివించాను.

అన్ని కార్య క్రమాలు అయ్యాక, 'ఫుడ్ టైం' వచ్చేసరికి మూడున్నరయ్యింది–

వెంకటరత్నం గారింట్లో మేడ మీద ఏర్పాట్లు చేశారు.

బఫే సిస్టమ్.

పెద్దగా చేసిన ఐటమ్స్ లేవుకానీ, అన్నీ కాస్టలీ అయిటమ్స్–

బాదుషా, బిర్యానీ వగైరా–

బిర్యానీ ఓ గరిటెడు ప్లేటులో వేసుకొని తింటున్నాను. వెంకటరత్నం గారు అటువైపు వచ్చి, నన్ను చూసి పలకరింపుగా నవ్వి, నేను ఆశ్చర్యంలోంచి తేరుకోక ముందే మెల్లగా–

".... చూడవోయ్ ప్రసాద్... అనుకున్న వారి కన్నా ఎక్కువమంది వచ్చారు.... అర్జెంటుగా వక్కపొడి తేవాలి.... డ్రైవరూ వాళ్ళు ఏవో పనుల్లో వున్నారు.... ఏమీ అనుకోక పోతే.... నువ్వెళ్ళి ఓ ఐదు వందల గ్రాముల వక్కపొడి తీసుకురా...." అన్నారు అజ్ఞాపిస్తున్నట్టు–

డబ్బులిస్తారేమో నని చూశాను.

"వెంటనే తీసుకురావయ్యా...." అని వేగంగా అక్కడ నుండి కదిలారు.

ఏమంటే ఏమౌతుందో?

ప్రమోషన్ లిస్ట్ జ్ఞాపక మొచ్చింది. వ్యాపార సంబంధం. తప్పదు.

గరిటెడు బిర్యానీ తోనే ఆత్మారాముడ్ని తృప్తి పరిచి, రోడ్డు మీద పడ్డాను.

కొత్త ప్రదేశం.

షాపు లెక్కడున్నాయో తెలీదు.

మండుటెండ.

చెమటలు కక్కుకుంటూ, కాళ్ళు అరిగేలా, అరగంట దాటి తిరగ్గా, ఓ షాపు కన్పించింది.


వంద గ్రాముల పొట్లాలు ఐదు తీసుకొని, డబ్బు లిచ్చేటప్పుడు చూసుకున్నాను. చిల్లర పోగా మిగిలింది రెండు రూపాయలు. కరెక్టుగా బస్సు ఛార్జీలున్నాయి.

షాపు నుండి వెంకటరత్నం గారింటికి చేరుకొనే సరికి మరో పావుగంట గడిచింది.

వెంకటరత్నం గారు నా కోసం ఎదురు చూస్తున్నారు కాబోలు, నన్ను చూసి, నా దగ్గర కొచ్చి, చేతిలోని పొట్లాలు అందుకొని, 'థాంక్స్' అనేనా చెప్పకుండా లోపలికి వెళ్ళిపోయారు. డబ్బు లిద్దామనే వుద్దేశ్యం ఆయనలో కనబడలేదు.

'బఫే' ఏర్పాటు చేసిన వైపు కదిలాను, కనీసం కడుపైనా నింపుకుందామని–

నేను వెళ్ళేసరికి–



**కావలెను**

ఇంటి యజమాని దూరప్రదేశములోగల ఒక పెద్ద యింటి నిర్వహణ బాధ్యతలు చూడతగిన స్త్రీ అభ్యర్థినుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. ఉచిత వసతితోపాటు తగిన జీతము యివ్వబడును. వివరములతో బాక్స్‌నెం. 14, C/o. ఆంధ్రపత్రిక, విజయవాడ-3కి రాయండి.

**తెల్ల మచ్చలు**



ఇటీవలనే కనుగొన్న మా ఔషధాన్ని పై పూతగా వాడినట్లయితే 8 రోజులలో తెల్లమచ్చలు రంగు మారతాయి. క్రమేపి చర్మం మామూలు రంగుకి వస్తుంది. చికిత్స కొరకు పూర్తి వివరాలు వ్రాయండి.

SHYAM AYURVED BHAVAN (AP)
P. O. KATRI SARAI (GAYA)

Do it yourself at home with..



**DELUXE**
**MINI PRINTING PRESS**

FREE GUIDE
"MONEY-MAGNET" FOR YOU
Super Quality



Prepare Rubber stamps and print colourfully.
Letter Heads Cards etc.
Price—Rs. 55 only.
Postage Rs. 15/- Extra.
For V. P. Parcel write to
YOUNG INDIA TRADING CORPN
161/1, Mahatma Gandhi Road,
Calcutta-700007.

**తెల్లటి మచ్చలు**



మా ట్రీట్‌మెంట్ మొదలవ్వగానే మచ్చల యొక్క రంగు మారి పోవడం మొదలవుతుంది. మా ట్రీట్‌మెంట్‌కు ప్రయత్నించండి మరియు అది ఎంత బాగా పనిచేసుందో చూడండి. జబ్బు యొక్క వివరాలు వ్రాయండి. మీ జబ్బును గురించిన పూర్తి వివరాలు వాసి మా ఉచిత సలహాను అడగండి.

PARAG CLINIC (A.P.)
P. O. KATRI SARAI (GAYA)


## వెల అమూల్యం

పనివాళ్ళు బల్లలు సర్దుతున్నారు!

వెనుదిరిగాను. వెంకటరత్నంగారు ఎటు వైపు నుండి వచ్చారో గమనించలేదు, ఆయన నా దగ్గరకొచ్చి–

"... చూడవోయ్ ప్రసాద్... నాకింకో నాలుగు రోజుల వరకు ఆఫీసుకి రావడాన్కి కుదర్దు.... నువ్వు రేపు ఆఫీసు నుండి 'విజయ అండ్‌కో'... వాళ్ళ ఫైలు తీసుకురా... అదేనోయ్... కొత్త ప్రాడెక్ట్ లైసెన్సు కోసం అప్లయ్ చేశారూ... వాళ్ళది" అని – క్షణం ఆగి–

".. వచ్చినందుకు సంతోషం..." అని 'ఇంక దయ చేస్తావా?' అన్నట్టు చూశారు.

ఆత్మారాముడి అలాపనతో నే బైట కడుగు వేశాను. కొత్త ప్రదేశం వల్ల బస్టాండు ఎక్కడుందో తెలీక రోడ్లు తెగ తిరిగేస్తున్నాను.

అలా ఏకధాటిగా రోడ్లు తిరిగేస్తున్నప్పుడు– వెనక నుండో పిలుపు విన్పించింది–

విసుగ్గా వెనక్కి చూశాను.

"... నమస్తే సార్.." ఆఫీస్ ప్యూను రంగయ్య. అతని చేతిలో సంచీలో ఏవో సరుకులు.

".. మా యింటి కోసమే తిరుగుతున్నారా? సార్" మొహం యింత చేసుకొని అడిగాడు.

యాంత్రికంగా తలూపాను.

"..అయ్యయ్యో... ఎంత కష్టపడ్డారో... యిదిగో... ఈ వీధిలో నే యిక్కడే సార్...!!" అంటూ దారి తీశాడు. నేను అతన్ని అనుసరించాను. 'బస్టాండ్' ఎక్కడో అడిగి, బస్సు ఎక్కేద్దామనుకున్నానో క్షణం.

'ఎలాగు యింత దూరం వచ్చాను కదా' అనే వుద్దేశంతో అతన్ని అనుసరించాను.

చాలా చిన్న వీధది. లక్కపిడతల్లా యిళ్ళు. ఆర్థికంగా వెనకబడ్డ వారి యిళ్ళలా వున్నాయి.

రంగయ్య యింటి ముందే చిన్న టెంట్ వేశారు. నన్ను పందిరికి దగ్గరగా వున్న కుర్చీలో కూర్చో పెట్టాడు. నేను కూర్చున్నాను.

"మా సార్ వచ్చారు" అన్నాడు హడావిడి పడిపోతూ– రెండు నిముషాల తరువాత–

"..సార్... సల్లంగా ఈ డ్రింకు తాగండి... ఎండలో బడి వచ్చారు." అని చేతికి ఓ గ్లాసుతో డ్రింకు తీసుకొచ్చాడు. చాలా తియ్యగా చల్లగా వుందా ద్రవం.

ఎడారిలో దాహంతో పిడచగట్టిన గొంతుతో సతమవుతున్న మనిషికి ఒయాసిస్సు లభించినట్టుగా వుంది. అమృతంలా ఒక్క చుక్క కూడా విడవకుండా తాగేశాను. కడుపు చల్లబడింది. అక్కడే వున్న ఒకతన్ని పిలిచి–

"సార్ కేమైనా అవసరమొస్తే చూడు..." అని–

"కొంచెం పనుంది సార్... లోపల..." అంటూ లోపలికెళ్ళాడు. చాలా సాదాగా వుందా పెళ్ళి పందిరి.

డోలూ, సన్నాయి పందిరిలో మారు మ్రోగుతున్నాయి. మరో పావుగంటకి–

చేతో ఉప్మా ప్లేటుతో వచ్చాడు రంగయ్య.

నేనట్టే మొహ మాట పడకుండా తినేశాను.

"సార్... చాలా మంచివాడు... ఎక్కడకొచ్చినా అందరిలో కలిసి పోతాడు....' అని సంబరపడ్డాడు రంగయ్య. పెళ్ళయ్యింది.

ప్రత్యేకంగా పీట వేసి భోజనానికి ఆహ్వానించారు నేనెందుకో గిల్టీ ఫీలయ్యాను. ఒకప్పుడు రాకూడదనుకున్న పెళ్ళి. అసలు ఈ పెళ్ళికి వస్తానని కలలో కూడా వూహించలేదు.

"...ఫర్వాలేదు రంగయ్యా... పెళ్ళి చూద్దామని వచ్చాను... వస్తాను" అని కదలబోతుంటే–

"... అట్లా అంటే కుదరదు సార్... మీరు భోం చేసి వెళ్ళాలి..." అన్నాడు బ్రతిమాలుతున్నట్టు రంగయ్య.

"... అది కాదు రంగయ్యా..." అని ఏదో చెప్పబోతుంటే–

"...మీరు భోం చేయక తప్పదు.." అని భోజనానికి లేవదీశాడు. టెంట్‌లో నే విస్తళ్ళు వేశారు.

కొసరి కొసరి వడ్డనలు చేస్తున్నారు.

ప్రతి వంటకాన్ని ముందు నన్నడిగి, తరువాతే మిగిలిన వారికి 'చూపెడుతున్నారు'–

ఏదో గర్వం ఆవహించిందా క్షణం నాలో–

కానీ–

మరుక్షణం ఆ 'గర్వమే' వికృతంగా అన్పించింది నాకు. వెంకటరత్నం గారింట్లోని నా స్థితి గుర్తుకొచ్చి–

ముద్ద గొంతు కడ్డం పడట్టన్పించింది. ఎంత విచిత్రమైన వాడు మనిషి–

తనకి విలువ లేకపోయినా తన పైవాళ్ళని ఆశ్రయిద్దామనుకుంటాడు... తనకి విలువ నిచ్చే వారి కేసి కన్నెత్తైనా చూడడు. వెంకరత్నంగారు మా ఆఫీసర్. ఆయనతో నాకు ముందు ముందు చాలా అవసరాలు రావొచ్చు.

రంగయ్య రెండు మూడు ఏళ్ళలో రిటైరు అవుతాడు. నిజం చెప్పాలంటే రంగయ్యకి నా అవసరం లేదు. కానీ నన్ను చాలా 'గౌరవంగా' చూస్తున్నాడు–

ఆ క్షణమే అన్పించింది.

ఈ వ్యాపార సంబంధాల కన్నా అతీతమైన బంధం ఒకటుందని! మనిషిని డబ్బా, హోదా రీత్యానే 'అంచనా' వేయలేమని!

"... సార్‌కి... మరో రెండు బూరె లియ్యరా..." అన్న రంగయ్య కేకకి నా ఆలోచన చెదిరింది–

"వద్దు.. వద్దు..." అంటూ చేతులడ్డుపెట్టాను. బూరెలు విస్తట్లో పడ్డాయప్పటికే–

... కళ్ళలోచిమ్మిన నీరు ఎవరైనా చూస్తారేమోనని తల అటు వైపు తిప్పుకున్నాను!